సర్వ శుభకరం.. సంగమేశ్వరుని దర్శనం

- వాస్తు శిల్పకళతో విరాజిల్లుతున్న రూపాల సంగమేశ్వరాలయం
- పంచేశ్వర క్షేత్రాల్లో సంగమేశ్వరాలయం ప్రత్యేకం
- జిల్లాలో విరాజిల్లుతున్న ప్రముఖ శైవక్షేత్రం
- నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని దిన్నెదేవర పాడు గ్రామ పొలిమేర జగన్నాథ గట్టుపై వెలసిన రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం వాస్తు శిల్పకళతో విరాజిల్లుతోంది. కపిలేశ్వరం, సోమేశ్వరం, మల్లేశ్వరం, అమరేశ్వరమనే పంచేశ్వర క్షేత్రాల్లో ఒకటిగా రూపాల సంగమేశ్వరాలయం ఉంది. కృష్ణానదితో భవనాశి కలిసే ప్రదేశాన్ని నివృత్తి సంగమేశ్వరమనీ, కొద్దిగా ఎగువ నున్న ప్రదేశానికి రూపాల సంగమేశ్వరమనీ పేరు. కల్యాణి, చాళుక్య, కాకతీయ, విజయనగర రాజుల ఆదరణలో నివృత్తి సంగమేశ్వరాలయ సముదాయం రూపుదిద్దుకొంది. భీముడు వారణాసి నుంచి ప్రతిష్ట కోసం లింగం తేవడానికి వెళ్లి ముహూర్త సమయానికి రాలేకపోయాడని, నిర్ణయించిన సమయానికి ధర్మరాజు ఒక వేప కొయ్యను శివలింగంగా ప్రతిష్టించాడని పండితులు చెబుతున్నారు. జల సమాధి అయిన ఈ ఆలయ సముదాయం వద్ద కొన్నేళ్లుగా విశేష పూజలు జరుగుతున్నాయి. కొంచెం ఎగువన రాష్ట్ర కూట రాజు కృష్ణునిచే ఎల్లోరాలోని కైలాస నాథాలయ నమూనాలో రూపాల సంగమేశ్వరాలయం నిర్మించబడింది. అద్భుత వాస్తుశిల్ప కళకు ముచ్చుతునకైన ఈ గుడి నీటి ముంపునకు గురైంది. దీంతో అక్కడి నుంచి తరలించి కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టుపై యథాతథంగా పునర్నిర్మించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా విడిపోయిన తరువాత జిల్లాలో ఉన్న ప్రముఖ శైవాలయంగా నిలుస్తోంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్షలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నారు.



రూపాల సంగమేశ్వరుడు



శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి దేవాలయం

శివరాత్రి ఉత్సవాలు ఇలా..

- మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్ర, శనివారాల్లో జగన్నాథ గట్టులోని ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు దేవదాయ శాఖ, జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.
- శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల నుంచి స్వామివారికి పంచామృత రుద్రాభిషేకం, 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్వామి వారికి పాలాభిషేకం, అనంతరం స్వామివారికి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు.
- సాయంత్రం 6 గంటలకు దిన్నెదేవరపాడు గ్రామస్తులచే ప్రభోత్సవం ఉంటుంది.
- రాత్రి 12 నుంచి 1 గంట వరకు లింగోద్భవ అభిషేకం, శనివారం తెల్లవారు జామున 3 గంటలకు శివపార్వతుల కల్యాణం, స్వామివారి ప్రాకార పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయి.
- భక్తులు జాగరణ చేసేందుకు నాట్య వేద కూచిపూడి కళా నిలయం, కర్నూలు విజ్ఞాన పీఠం, దేవస్థానం వారిచే ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ, భజన కార్యక్రమాలు ఉంటాయి.
- శనివారం సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల రథోత్సవం నిర్వహిస్తారు.
- 8వ తేదీ ఉదయం 5 నుంచి 9 వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఏపీఎస్ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. గడియారం ఆస్పత్రి, కొత్త బస్టాండ్, రాజ్‌విహార్, సీక్యాంప్, వెంకటరమణ కాలనీ, బళ్లారి చౌరస్తా, కల్లూరు, కృష్ణానగర్, దిన్నెదేవరపాడు మీదుగా జగన్నాథ గట్టుపైకి బస్సు సౌకర్యం ఉంటుంది.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



శివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఆర్డీఓ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ జరిగింది. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సుమారు లక్ష మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం ఉంది. భక్తులు జాగరణ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. కర్నూలు నగరం నలుమూలల నుంచి భక్తులు జగన్నాథ గట్టుకు వచ్చేందుకు ఆర్టీసీ వారు బస్సు సౌకర్యం కల్పించారు.

– ప్రసన్నలక్ష్మి, సహాయ కమిషనర్, ఆలయం ఈఓ

జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రం



ఉమ్మడి కర్నూలు జిల్లా విడిపోయిన తరువాత జిల్లాలో ఉన్న ప్రముఖ శైవాలయం రూపాల సంగమేశ్వరాలయం. శివరాత్రి ఉత్సవాలకు ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. దేవదాయశాఖ, జగన్నాథ గట్టు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– ప్యాలకుర్తి నరసింహారెడ్డి, అధ్యక్షులు, జగన్నాథగట్టు అభివృద్ధి కమిటీ

క్లుప్తంగా

బెస్తలను మోసం చేసిన చంద్రబాబు



కర్నూలు(అర్బన్): చంద్రబాబునాయుడు బెస్తలను మోసం చేశారని జాతీయ మత్స్యకార సంఘం నగర అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం బీసీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గుంటూరులో నిర్వహించిన జయహో బీసీ సభలో ప్రకటించిన బీసీ మేనిఫెస్టోలో బెస్తల ప్రస్తావనే లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయకపోగా, ఇప్పుడు తిరిగి అధికారంలోకి వచ్చే ప్రయత్నంలో బెస్త సాధికార కమిటీ పేరుతో వంచించేందుకు సిద్ధమయ్యారన్నారు. రాష్ట్రంలో బెస్తలను గుర్తించిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. బెస్తలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, సముచిత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బెస్తలు అండగా ఉండాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 9న మతస్వేచ్ఛ, మత సామరస్యాన్ని కాపాడాలి అంశంపై జరిగే సదస్సు పోస్టర్‌ను సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ ఆవిష్కరించారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జెడ్పీ ఆవరణలోని ఎంపీపీ హాలులో సదస్సు ఉంటుందని, సామాజిక విశ్లేషకులు, దళిత శోషన్ ముక్తి మంచ్ జాతీయ నాయకులు జే.జాన్ వెస్లీ ముఖ్య వక్తగా హాజరు అవుతారని చెప్పారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలు అందుకున్న వారితో సతీష్, హర్షవర్ధన్ రెడ్డి

కర్నూలు (సిటీ): స్థానిక 39, 40 వార్డులకు చెందిన 300 మంది పేదలకు వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి గురువారం ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, 39వ వార్డు కార్పొరేటర్ సాంబశివరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్‌రావు, యువజన విభాగం జిల్లా కార్యదర్శి గిరిప్రసాద్, నాయకులు కిరణ్, సయ్యద్ ఇషాద్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు వాసికి డాక్టరేట్



మునుగాల శ్రీనివాసులు

కర్నూలు సిటీ: గూడూరు మండల కేంద్రానికి చెందిన మునుగాల శ్రీనివాసులకు ఎస్కే యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రొఫెసర్ రవీందర్ పర్యవేక్షణలో 'రాయలసీమ విశ్వవిద్యాలయాల ఎంటెక్ విద్యార్థులు ఉన్నత విద్యలో సమాచారాన్ని స్వీకరించే నిమిత్తం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని అధిగమించి పోటీ ప్రపంచంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఆకలింపు చేసుకోవడం, సాంకేతిక విద్యలో గ్రంథాలయాలు, ఎలక్ట్రానిక్ వనరుల ప్రాముఖ్యత'పై చేసిన పరిశోధనలకు గానూ తనకు ఎస్కే యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చిందని శ్రీనివాసులు తెలిపారు.

14న చలో ఢిల్లీ

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 14న సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం తెలిపారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప అధ్యక్షతన సంయుక్త కిసాన్ మోర్చనాయకులు నాగేంద్ర, పంపన్నగౌడ్, ఎండీ అంజిబాబు, పీఎస్ రాధాకృష్ణ, జి.చంద్రశేఖర్, టి.రామాంజనేయులు, రహిమాన్, ఈశ్వర్, నాగన్న, సురేష్, జి.రామకృష్ణ సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని చట్టం చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.



మహిళలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్, ఎస్వీ మోహన్‌రెడ్డి

ప్రజలతో మమేకమవుతూ..

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్ గురువారం సాయంత్రం నగరంలో పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో కలిసి 16వ వార్డు బుధవారపేట, హబీబ్ ముబారక్ నగర్‌లలో ఇంటింటికి తిరిగి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఆర్థికగా భరోసా ఇచ్చిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిందన్నారు. మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల జగనన్న పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీసిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

కర్నూలు (టౌన్): స్థానిక జొహరాపురం జమ్మిచెట్టు వద్ద 35 ఎంఎల్‌డి సామర్థ్యం కలిగిన కొత్త సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు గురువారం సాయంత్రం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ స్థలాన్ని పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్ ఈఈ షాకీర్ హుస్సేన్, ఏఈలు నాగశేఖర్ పాల్గొన్నారు.

అనుమతులు లేని ల్యాబ్‌లు సీజ్ చేయాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ అనుమతులు లేని ల్యాబోరేటరీలను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలు గాలికొదిలి పదుల సంఖ్యలో ల్యాబోరేటరీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా కొన్ని ల్యాబోరేటరీలు ఆసుపత్రి ఆవరణలోనే కరపత్రాలు పంపిణీ చేస్తూ రోగులను ఆకర్షిస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి ల్యాబ్‌లను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంటి, నాగరాజు, చిన్న, ఖాసీం, రమేష్, మునిస్వామి, శివ, శ్రీను, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బోయపాటి లతశ్రీ, తదితరులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో మహిళా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీలో జరిగిన వేడుకల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బోయపాటి శ్రీలత, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ఏక్యాంపు మాంటిస్సోరి ఐ-కిడ్స్ విభాగంలో మూడు రోజుల పాటు జరిగిన మహిళా దినోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు 'రుచి పుష్కలంగా(ఫ్లేవర్ గ్యాలోరి)' కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లులు చేసిన వంటలు ఆకట్టుకున్నాయి. స్కూల్ అధినేత కేఎస్‌వీ రాజశేఖర్, రిటైర్డ్ హెచ్‌ఎం శశికళ, ఏఓ రాధ, హెచ్‌ఎం రమాజ్యోతి, కో-ఆర్డినేటర్స్ హెప్సీబా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.
- రవీంద్ర, జి.పుల్లయ్య, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీల్లోనూ మహిళా దినోత్సవాలను నిర్వహించుకున్నారు.
- **కర్నూలు కల్చరల్:** రాయలసీమ విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- **కర్నూలు(అగ్రికల్చర్):** జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో కర్నూలు ఏడీఏ కార్యాలయ ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- **కర్నూలు (టౌన్):** నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మెప్మా పీడీ నాగశివలీల పాల్గొన్నారు.

హంస సంఘానికి ప్రభుత్వ గుర్తింపు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస)కు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపునిస్తూ జీవో నెం.24ను తీసుకొచ్చిందని ఆ సంఘం నగర అధ్యక్షులు టి. గోవిందు చెప్పారు. గురువారం హంస సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ సంఘానికి గుర్తింపు నివ్వడం ఎంతో ఆనందంగా ఉందని, అలాగే వైద్య శాఖలో కాంట్రాక్టు వ్యవస్థలో పనిచేస్తున్న వారినందరినీ రెగ్యులర్ చేస్తూ కూడా జీవో జారీ చేయడం అభినందనీయమన్నారు. దీనివల్ల కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారన్నారు. ఇందుకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులు అరవపాల్‌కు ధన్యవాదాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో చిన్న సమస్య నుంచి పెద్ద సమస్య వరకు ఏ సమస్య అయినా ఆరవపాల్ దృష్టికి వచ్చినా వెంటనే పరిష్కరించేలా చేస్తున్నామన్నారు. సంఘం గుర్తింపు కోసం కృషి చేసిన కాకర్ల వెంకటరామిరెడ్డి, హంస కర్నూలు జిల్లా అధ్యక్షులు రఘుబాబు, ప్రధాన కార్యదర్శి సయ్యద్ షఫీకి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరచుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రూపొందించిన హెల్త్ ప్యాకేజీని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులు అందించే ఇలాంటి ప్యాకేజీలను ఉపయోగించుకుని ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. సమాజంలో స్త్రీలను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అని, వారికి ఆరోగ్యాన్ని అందించడంలోనూ ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, సెంటర్ హెడ్ నీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.